క్లుప్తంగా

అగ్ని వీరుడికి సన్మానం



ఆర్మీకి ఎంపికైన కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సాతనూరు గ్రామ యూత్ సభ్యులు

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు గ్రామానికి చెందిన ఈరన్న, సావిత్రమ్మ దంపతుల కుమారుడు కిరణ్ కుమార్ అగ్నిపథ్ విభాగంలో ఆర్మీ ఉద్యోగం సాధించాడు. ఆ యువకుడు ఆర్మీ శిక్షణ పూర్తి చేసుకోగా ఈ నెల 20వ తేదీన తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో ఉద్యోగంలో చేరనున్నాడు. ఈ మేరకు మంగళవారం గ్రామ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్మీ ఉద్యోగం సాధించిన జవానును గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు.

రైల్వేస్టేషన్‌కు వీల్‌చైర్లు అందజేత

ఆదోనిఅర్బన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదోని రైల్వేశాఖకు రెండు వీల్‌చైర్‌లను అందజేశారు. అలాగే జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఆదోని ప్రెసిడెంట్ విట్టా శ్రావణి, సెక్రటరీ ఎస్. మాలతి, ట్రెజరర్ రాయచోటి అభిరూప మాట్లాడారు నడవలేని వారిని రైలు బోగీ వద్దకు తీసుకెళ్లేందుకు ఈ వీల్‌చైర్లు ఉపయోగపడతాయన్నారు. ఐఎస్‌ఓ లీన, సత్య, కోమల, ఇన్నర్ వీల్ క్లబ్, రైల్వే, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఈరన్న స్వామి జాతర



ఆలయ ప్రధాన ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన షెడ్డులో భక్తుల విడిది

కౌతాళం: ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. అందుకు తగ్గట్టుగా నిర్వాహకులు ఆలయంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఆలయ ముఖద్వారం వద్ద భారీ షెడ్డును ఏర్పాటు చేశారు. అలాగే ప్రధాన క్యూలైన్ పక్కన షెడ్డు నిర్మించడంతో భక్తులు అందులో సేద తీరుతున్నారు. నేడు (బుధవా రం) అమావాస్య ఉండడంతో భక్తులు మంగళవారం సాయంత్రం నుంచి తరలివచ్చి స్వామిని పూజించుకుంటారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని భక్తుల విడిది కోసం షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే క్యూలైన్ వద్ద, ఆలయ ముఖద్వారం వద్ద షెడ్ల నిర్మాణం పూర్తి కాగా మరో రెండు చోట్ల ఇలాంటి షెడ్లను నిర్మిస్తున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్ గౌడ్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం



మాట్లాడుతున్న విశ్వనాథ్ రెడ్డి

మంత్రాలయం: మండల పరిధిలోని వగరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ క్రీడా రంగంలో రాణిస్తున్న విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్ రెడ్డి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం పంద్రాగస్టు వేడుకల సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డితో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



రౌడూరు గ్రామంలో విద్యార్థినులకు చెక్కులను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని కెనరా బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ మల్లికార్జున అన్నారు. ఆ బ్యాంకు ఆధ్వర్యంలో విద్యాజ్యోతి పథకం కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. మండల పరిధిలోని రౌడూరు గ్రామంలోని ఆరుగురు విద్యార్థినులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 5, 6, 7 తరగతుల వారికి ఒక్కొక్కరికి రూ. 2500, అలాగే 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు రూ.5 వేల ప్రకారం అందజేసినట్లు తెలిపారు. సర్పంచ్ సుశీల, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళపై లైంగిక దాడి

తుగ్గలి: ఓ మహిళపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడిన తుగ్గలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఎద్దులదొడ్డి గ్రామానికి చెందిన ఎస్సీ మహిళ (35) ఈ నెల 5వ తేదీన పొలం పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన రామానాయుడు, ఉపేంద్ర గౌడ్ చెట్ల పొదల్లోకి బలవంతంగా లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా ఈ దృశ్యాలను వాట్సాప్‌లో పెట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తనను బెదిరించి లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జున మంగళవారం తెలిపారు.



ఆదోని రెండో అదనపు జిల్లా కోర్టులో జెండా ఎగురవేస్తున్న జడ్జి పి.జె.సుధ



జాతీయ పతాకంతో విన్యాసం చేస్తున్న నేషనల్ పాఠశాల విద్యార్థులు



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి, సిబ్బంది



ఆదోని మున్సిపల్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ శాంత, కమిషనర్



జెండా ఆవిష్కరణ చేసిన ఏంఈఓ బి.శివరాములు

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో మంగళవారం 77వ స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆయన సతీమణి కాప్రెల్ అరోరా జెండా ఎగురవేసి వందనం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గీతావాణి, ఆదోని తాలూకా పోలీస్‌స్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి, ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీనివాసులు, పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ చిన్నపీరయ్య, సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో సబ్‌రిజిస్టర్ రాజశేఖర్, హౌసింగ్ కార్యాలయంలో ఈఈ రవి కుమార్, తదితరులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. వారు మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను గుర్తుచేశారు.

● ఆదోని రెండో అదనపు జిల్లా కోర్టులో జడ్జి పి.జె. సుధ జెండాను ఎగురవేసి వందనం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశ భక్తి కలిగి ఉండాలని, సాటి మనిషికి సాయం చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ న్యాయవాదులు మజర్ ఉల్ హక్, దేశాయి, వైఆర్ మల్లికార్జున, సుందర్‌సింగ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ఆదోనిలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి.



పంద్రాగస్టు వేడుకల్లో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మహనీయుల ప్రాణత్యాగ ఫలితమే స్వాతంత్య్రం

ఆదోనిటౌన్: ఎందరో త్యాగధనుల పోరాటం, ప్రాణ త్యాగ ఫలితమే స్వాతంత్య్రం అని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. వారి ఆశలు, ఆశయాలు, దేశం కోసం చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆదోనిలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఎస్కేడీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే తిరంగా జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బోయశాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఆర్టీసీ డిపోలో డీఎం రఫిక్‌అహ్మద్ జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్, పట్టణాధ్యక్షుడు దేవా, మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు పండుగ

మంత్రాలయం: మండలంలో పంద్రాగస్టు వేడుకలు పండుగలా జరిగాయి. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తుంగభద్ర గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, వైబీఆర్ స్కూల్, మంచాల సహకార సంఘం, ఎంపీడీఓ కార్యాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి జెండావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. తుంగభద్ర పాఠశాలలో చదివిన విద్యార్థులు అగ్నివీర్, పోస్టల్ సూపరింటెండెంట్‌గా ఎంపిక కావడం, కౌతాళం మండలం హాల్వి పాఠశాల విద్యార్థి విదేశీ చదువులకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఎస్‌ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు జి.భీమారెడ్డి, ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ మణిమంజరి, ఎంఈఓలు మోహీనుద్దీన్, రాఘన్న, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



నదిచాగి గ్రామం తొంటరాధ్య మఠంలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



కోసిగిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పెద్దకడబూరు సమీపంలో బూడిదగొట్టు కొండపై జెండాను ఎగరవేసిన ఆర్మీ అధికారి శివరాజ్



కౌతాళంలో శాంతి కపోతం ఎగురవేస్తున్న దృశ్యం



కౌతాళంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం



కౌతాళంలో జాతీయ జెండాతో విద్యార్థుల విన్యాసం

తాగునీటి సమస్య పరిష్కారం



కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో గతేడాది 29, 30, జనవరి 3, 4వ తేదీల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో బంగారమ్మవ్వ గుడి వద్ద తాగునీటి సమస్య, ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా రూ.5.67 లక్షల వ్యయంతో బంగారమ్మవ్వ గుడి వద్ద పైగేరి ప్రజలకు మంచి నీటి పైప్‌లైన్ వేయించి కుళాయిలు ఏర్పాటుచేశారు. మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేదస్వరూపతో కలిసి కుళాయిలను ప్రారంభించి ప్రజలకు మంచి నీటిని అందించారు. అదే గ్రామంలో రూ.16 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో వెలసిన బంగారమ్మవ్వను ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ కిరణ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, ఇన్‌ఛార్జ్ విశ్వానాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ మజ్జిగ గోవిందమ్మ, సర్పంచ్ మేకల సుజాత, ఎంపీటీసీ సభ్యులు మజ్జిగనరసమ్మ, కోసిగి జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి



పెద్దకడబూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

పెద్దకడబూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావి తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలని ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎంపీడీఓ శ్రీనివాస రావ్ ఆధ్వర్యంలో మంగళవారం 'నా భూమి – నా దేశం' కార్యాక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈఓలు సువర్ణల సునియం, రామమూర్తి, సర్పంచ్ రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఏపీఓ రామన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్న ఐదుగురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. గంజిహళ్లి గ్రామానికి చెందిన తలారి ఆంజనేయులు, కురువ వెంకటేష్, పైయింటి రంగస్వామి, దండు మద్దిలేటి, కురువ దరగయ్యలు కలిసి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో నాటుసారా తయారు చేసుకొని అదే గ్రామంలో వాల్మీకి విగ్రహం సమీపంలో విక్రయిస్తున్నారన్నారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ఐదుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే నాటుసారా తయారు చేస్తున్న స్థావరానికి వెళ్లి బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, అమ్మినా, అక్రమంగా మద్యం విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భళా.. వృషభ రాజా !



మిరప పైరులో గుంటక లాగుతున్న బెల్డోణ పెద్ద రంగన్న వృషభాలు

చిప్పగిరి: ఖరీఫ్‌లో గాని రబీలో గానీ మామూలుగా వృషభాలు 10 ఎకరాలు సేద్యం పాయాలంటే తలకు మించిన భారం అవుతుంది. అలాంటిది మిరప పంటలో అంతర సేద్యంలో భాగంగా గుంటక పాయడం ఉదయం 6 గంటలకు మొదలు పెట్టి మధ్యాహ్నం 1 గంట వరకు ఏకంగా 18 ఎకరాలు పాసి మండలంలోని బెల్డోణ గ్రామానికి చెందిన అచ్చమ్మ గారి పెద్ద రంగన్న ఎద్దులు ఔరా అనిపించాయి. ఈ సందర్భంగా గుంటక పాసిన రైతులు వెంకటేష్, గుండప్పలను గ్రామస్తులు అభినందించారు.

వేలంలో రూ. 2.02 లక్షల ఆదాయం

ఆస్పరి: మండలంలోని తంగరడోన గ్రామంలో నిర్వహించిన టెంకాయల విక్రయ హక్కుల వేలం రూ.2.02 లక్షలు పలికింది. ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు తంగరడోన గ్రామంలో జరిగే చింతలముని స్వామి, నల్లారెడ్డి స్వామి ఉత్సవాల్లో టెంకాయలు అమ్ముకునేందుకు ఆలయ చైర్మన్ పార్వతి ఆధ్వర్యంలో మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఇద్దరు పాటదారులు పాల్గొన్నారు. చివరకు ఆస్పరికి చెందిన సంజన్న రూ. 2.02 లక్షలకు పాడి హక్కులను దక్కించుకున్నారు. గతేడాది కంటే ప్రస్తుతం వేలం ద్వారా రూ. 6 వేలు ఆదాయం పెరిగినట్లు నిర్వాహకులు వెల్లడించారు. సర్పంచ్ శంకరమ్మ, గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకన్న, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణాలపై దాడులు

ఆలూరు: నియోజకవర్గ కేంద్రంలోని పలు కాలనీలలో మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం రోజున కొందరు వ్యాపారులు చికెన్, మటన్ విక్రయిస్తున్నట్లు గ్రామస్తులు పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో వారు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ కృష్ణకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించి కొందరు మటన్, చికెన్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేశామన్నారు. ఆయా దుకాణాలలో ఖాటా మిషన్లను స్వాధీనం చేసుకుని, కోళ్లను నిల్వ ఉంచే ఫారంలకు తాళాలు వేశామన్నారు. బిల్‌కలెక్టర్లు, మేస్త్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ అమ్మకాలు నిలుపుదల

మద్దికెర: స్థానిక లేపాక్షి ఫర్టిలైజర్స్ షాప్‌లో పలు ఉత్పత్తుల అమ్మకాలు నిలుపుదల చేసినట్లు ఏఓ రవి తెలిపారు. ఆయన మంగళవారం ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా స్టాక్ రిజిస్టర్‌లో పొందుపరచని మందులను విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. దీంతో రూ.1,17,729 విలువ చేసే ఉత్పత్తుల విక్రయాలు నిలుపుదల చేసినట్లు చెప్పారు. దుకాణ యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని లేకపోతే షాప్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామంలో సోమవారం పొలం పనికి కూలికి వెళ్లి పాము కాటుకు గురై మృతి చెందిన చాకలి ఉరుకుందమ్మ కుటుంబానికి ఎస్సీ కాలనీకి చెందిన సింగనేటి శివ రూ.5,016 సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మృతురాలికి నలుగురు సంతానం అని, కూలి పనులు చేసుకొని జీవనం సాగించే వారి కుటుంబంపై విధి చిన్నచూపు చూసిందన్నారు. మానవతదృక్పథంతో తనకు చేతనైన సాయం చేస్తున్నానని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

బాలుడికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసుల తెలిపారు. గ్రామ సమీపాన నిర్వహిస్తున్న ఇటుకల ఫ్యాక్టరీలో పని చేస్తున్న బీహార్‌కు చెందిన దంపతులు పని చేస్తున్నారు. వారి కుమారుడు ఎనిమిదేళ్ల గౌరబ్‌కుమార్ రోడ్డు దాటేక్రమంలో కర్నూలు నుంచి నంద్యాల వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలైనట్లు చెప్పారు. గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రికి తరలించారు.

ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆలూరులో మాట్లాడుతున్న శ్రీహరిరావు

ఆలూరు రూరల్: ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీహరిరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్లు ఎంత మంది ఉన్నారు, వారి జీవన విధానం, స్థితిగతులపై చేపట్టిన సర్వేలో భాగంగా మంగళవారం ఆయన ఆలూరులో ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులతో సమావేశం అయ్యారు. ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల్‌రాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్లు పనిచేస్తున్నారని చెప్పారు. వారి సమస్యలు, అందాల్సిన సంక్షేమ పథకాలను తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని తెలిపారు. ఆలూరు ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు ఏకాంబరం, అంజి రెడ్డి, ఖాసీం, నాగరాజు, ఏడు కొండలు, బాషా తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి



ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న కర్లకుంట స్కూల్ విద్యార్థులు

కృష్ణగిరి: మండల పరిధిలోని కర్లకుంట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ వాడకం కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జెండా పండుగ పురస్కరించుకుని మంగళవారం విద్యార్థికి భూమాత వేషధారణ వేయించి 'ప్లాస్టిక్ మానేయండి – మమ్మల్ని కాపాడండి' అంటూ ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ గ్రామంలో పర్యటించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల ఆ వ్యర్థాలు భూమిలో కలిసి విషపూరితం అవుతున్నాయని, దీంతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని క్రమంగా నిషేధించాలని అవగాహన కల్పించారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు ప్రశంసా పత్రం



డ్రైవర్ శివపుత్రకు ప్రశంసా పత్రం అందజేస్తున్న డిపో మేనేజర్ రఫిక్ అహ్మద్

ఆదోనిఅర్బన్: ఆదోని ఆర్టీసీ డిపో మేనేజర్ రఫిక్‌అహ్మద్ చేతులమీదుగా మంగళవారం డ్రైవర్ శివపుత్రకు ఆదర్శ ఉద్యోగుల అభినందన పత్రంను అందజేశారు. 77వ స్వాతంత్య్ర దిన వేడుకల్లో భాగంగా విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసి, డీజిల్‌ను ఆదా చేసినందుకు డ్రైవర్ శివపుత్రకు ప్రశంసా పత్రం అందజేసినట్లు డీఎం చెప్పారు. డ్రైవర్ సేవలను కొనియాడారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఐదు రోజుల పాటు వినాయక ఉత్సవాలు

ఎమ్మిగనూరుటౌన్: వినాయక మండలి సభ్యుల వినతి మేరకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, డీఎస్పీ సీతారామయ్య పట్టణంలో ఐదు రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకునేందుకు అనుమతించడంతో ఆ మేరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు స్థానిక గణేష్ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో.. గణేష్ ఉత్సవ కేంద్ర సమితి అధ్యక్షులు శివకుమార్, సభ్యులు కామర్తినాగేషప్ప, యూకే రామకృష్ణ, తోగట నరసింహులు, ప్రకాష్‌జైన్, లలిత్ జైన్ మాట్లాడారు. పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు ఐదు రోజుల పాటు చేసుకోవాలన్నారు. పోలీసు నిబంధనలు పాటిస్తూ ఆయా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు తెలుగు రాముడు, వెంకటగిరి, రాజేష్, కృష్ణవేణి, శీను పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ కింద చెరువుల అభివృద్ధి

కృష్ణగిరి: అమృత్ సరోవర్ కింద కేంద్ర ప్రభుత్వం చెరువుల్లో అభివృద్ధి పనులు చేపట్టి నీటి నిల్వను పెంచేందుకు చర్యలు తీసుకుందని ఏపీఓ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని పెనుమాడ గ్రామ చెరువులో అమృత్ సరోవర్ కింద ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశంలో సిబ్బందితో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పెనుమాడ చెరువులో అమృత్ సరోవర్ కింద పూడికతీత, కట్టకు మట్టి, కంప తొలగింపు తదితర పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇలా మండలంలోని అన్ని చెరువుల్లో అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మొక్కలు నాటడమే గాకుండా వాటిని పరిరక్షించినప్పుడే వృక్షాలుగా మారుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరయ్య, భాస్కర్, రాజశేఖర్, మాదులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థినుల చదువుకు ప్రోత్సాహం



చెక్కులను అందజేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

చిప్పగిరి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో విద్యాజ్యోతి స్కాలర్‌షిప్‌ల పంపిణీలో భాగంగా విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరచిన చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను మంగళవారం బ్యాంకు సిబ్బంది అందించారు. ఈ సందర్భంగా చందు, గీతా మాధురి, అనితలకు రూ.5 వేలు, జీఎస్ షర్మిలకు రూ 2,500 చొప్పున అందించారు. బ్యాంకు మేనేజర్ రవి, ప్రధానోపాధ్యాయుల లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.